క్లుప్తంగా

వీఎంసీ కార్యాలయాల్లో నేడు స్పందన

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం ప్రతి సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో జరుగుతుందని వివరించారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరవాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలని తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు జరగనుండటంతో సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి.సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ కండ్రిక ఫీడర్ పరిధిలోని ఓల్డ్ పాయకాపురం, బర్మాకాలనీ, నూజివీడు రోడ్డు, కండ్రిక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేటి నుంచి 32వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక సమస్యలను స్వయంగా గుర్తించి పరిష్కరించడమే ధ్యేయంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఉదయం 7 గంటలకు 32వ డివిజన్ అయోధ్యనగర్ ఆర్చి నుంచి ప్రారంభమవుతుందని వీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, వీఎంసీ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై రాజమహేంద్రవరానికి చెందిన సత్య శ్రావణి నృత్యనికేతన్‌కు చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం చేసిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం చేయించిన అధికారులు ప్రసాదాలను అందజేశారు.

28న దుర్గగుడి పాలక మండలి సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన పాలక మండలి సమావేశం ఈ నెల 28వ తేదీ జరగనుంది. బ్రాహ్మణ వీధిలోని దేవస్థాన భవనంలోని బోర్డు మీటింగ్ హాల్‌లో చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఆ రోజు ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి దుర్గగుడి ఈవో భ్రమరాంబ, ఆలయ ఏఈవోలతో పాటు ఇంజినీరింగ్ విభాగం అధికారులు హాజరుకానున్నారు. అక్టోబర్‌లో జరిగే దసరా మహోత్సవాల ఏర్పాట్ల పనులతో పాటు ఉత్సవాల నిర్వహణపై చర్చించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

ట్రాఫిక్ చిక్కులకు చెక్



పసుపుతోట రెండో రోడ్డులో బారికేడ్లు, ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసు



మధురానగర్ రైల్వే ట్రాక్ వద్ద ఇలా..

వన్‌వేగా పసుపుతోట, రెండు, మూడు రోడ్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెట్టారు. మధురానగర్ ఆర్‌యూబీ పనుల్లో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక గేటుపడితే ట్రాఫిక్ ఇబ్బందులు మరింత అధికమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష అధికారులతో మాట్లాడి ఇప్పటికే గద్దె వెంకట్రామయ్య ఉద్యానవనం ప్రహరీ పగులకొట్టించి సర్వీసు రోడ్డు వేయించారు. దీంతో కొంత మేర సమస్యలు తగ్గినా



ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వాహనాలు అన్నీ ఒకే మార్గంలో రాకపోకలు సాగించటంతో ట్రాఫిక్ తరచూ నిలిచిపోతోంది. దీంతో మరోసారి ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి మధురానగర్ నుంచి రైల్వేగేటుకు వెళ్లేటప్పుడు పసుపుతోట రెండో రోడ్డు, రైల్వే గేటు నుంచి వచ్చేటప్పుడు పసుపుతోట మూడో రోడ్డు నుంచి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు. దీనికి బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సిబ్బందిని నియమించారు. మధురానగర్ రైల్వేగేటు వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఇష్టారాజ్యంగా రాకుండా డివైడర్లను ఏర్పాటు చేశారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

యువతలో ప్రతిభను వెలికితీయడానికే..

కృష్ణలంక(విజయవాడతూర్పు): యువతలో ప్రతిభ వెలికితీయడానికి ఫొటో ఆర్ట్ కంటెస్ట్ నిర్వహించినట్లు సీఐఐ ఏపీ చైర్మన్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, జాషువా సాంస్కృతిక వేదిక, జీఆర్‌కే అండ్ పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యాన గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన మొబైల్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్, ఫొటో ఆర్ట్ కంటెస్ట్ ఆహూతులను అలరించి ఆలోచింపజేసింది. ఎగ్జిబిషన్‌లో 20 మంది యువ ఫొటోగ్రాఫర్స్ తీసిన 80 చిత్రాలను ప్రదర్శించారు. 6 నుంచి 10 వ తరగతి చదివే విద్యార్థులకు ఫొటో ఆర్ట్ కంటెస్ట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ కన్వీనర్ సునీల్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కుమార్, కో కన్వీనర్ గిరిధర్ అరసవల్లి, ఈవెంట్ మేనేజర్ స్ఫూర్తి శ్రీనివాస్, కో ఆర్డినేటర్లు కళాసాగర్ యెల్లపు, ఎస్.పి.మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిస్టులు బాగా నటించారు

డాక్టర్ మెహబూబ్ షేక్

లబ్బీపేట(విజయవాడతూర్పు): యువగళం పేరుతో విజయవాడలో రెండు రోజుల పాటు సాగిన లోకేష్ పాదయాత్రలో ఆర్టిస్టులు బాగా నటించారని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్‌జిల్లాల జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్ ఎద్దేవా చేశారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగాలు ఇవ్వడం లేదని నిరుద్యోగుల పేరుతో ఆర్టిస్టులతో నిరసన వ్యక్తం చేయడం సిగ్గుచేటన్నారు. మరోవైపు మైనార్టీలతో లోకేష్ సమావేశం కావడం హాస్యాస్పదమన్నారు. గత ఐదేళ్లలో కనీసం ఒక్క మైనార్టీకి కూడా మంత్రి పదవి ఇవ్వని లోకేష్, చంద్రబాబులు మైనార్టీలకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): హోమియో, ఆయుర్వేదంతో అన్ని వ్యాధులను నయం చేయవచ్చని ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్యులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం అన్నారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వృద్ధులకు ఆరోగ్య అవగాహన ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఆరోగ్యంగా ఉండటానికి వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం సుమారు 200 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కాపాడుకోవాలని డాక్టర్లు సూచించారు. కార్యక్రమాలను ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ పర్యవేక్షించారు.

కుమారుడు కనిపించడం లేదంటూ ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లిన తన కుమారుడు తిరిగి ఇంటికి రాలేదంటూ ఆదివారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురానగర్ వినాయక గుడి వీధిలో నివసిస్తున్న దారపు రెడ్డి సామ్రాజ్యం పెద్ద కుమారుడు రూప్‌కుమార్ ఈనెల 15వ తేదీన స్నేహితుడు చంద్రతో కలిసి వెళతానని చెప్పి బయటకెళ్లాడు.

అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాకపోవటంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. దీంతో చంద్రను అడగగా తన దగ్గర నుంచి అప్పుడే వెళ్లిపోయాడని చెప్పాడు. ఎంత వెదికినా ఆచూకీ తెలియకపోవటంతో ఆదివారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూప్‌కుమార్‌కు ఇంకా వివాహం కాలేదు. తల్లి సామ్రాజ్యం ఫిర్యాదుపై గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మంగారి జెండా ఉత్సవాలకు ముస్తాబు

- సంప్రదాయబద్ధంగా సాగుతున్న ఉత్సవాలు
- శ్రావణమాసం రెండో శుక్రవారం జెండా ఉత్సవం
- ముస్తాబైన బ్రహ్మంగారి జయధ్వజస్తంభం

కంకిపాడు: బ్రహ్మంగారి జయ ధ్వజస్తంభం జెండా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జెండా వేడుకకు సర్వం సిద్ధమైంది. సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఉత్సవాలకు ఏర్పాట్లను ఉత్సవ కమిటీ పర్యవేక్షిస్తోంది.

జెండా ఉత్సవానికి ఈడుపుగల్లు గ్రామం ముస్తాబైంది. రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన బ్రహ్మంగారి జయధ్వజ స్తంభాల్లో మూడింటిలో ఒకటి ఈడుపుగల్లులో ఉంది. ఏలూరు, జగ్గయ్యపేటలో రెండు ధ్వజ స్తంభాలు ఉన్నాయి. వీటిలో ఈడుపుగల్లు ధ్వజస్తంభమే పెద్దది. గ్రామం సిరిసంపదలతో తులతూగాలని, ప్రజల ఆరోగ్యం వృద్ధి చెందాలని కాంక్షిస్తూ ఏటా గ్రామంలో బ్రహ్మంగారి జెండా ఉత్సవాన్ని నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఏటా శ్రావణమాసం రెండో శుక్రవారం సంప్రదాయబద్ధంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

ధ్వజస్తంభం చరిత్ర ఇదీ..

ఈడుపుగల్లు గ్రామంలో 1835వ సంవత్సరంలో శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ధ్వజస్తంభాన్ని బ్రహ్మశ్రీ లంకెపల్లి రామబ్రహ్మయోగీంద్రులు స్థాపించారు. 1925 మే 15న సంభవించిన తుపానుతో ధ్వజస్తంభం శిథిలం కావటంతో



ధ్వజస్తంభం చుట్టూ కర్రలతో ఏర్పాటుచేసిన అడితి

1935లో వల్లభాపురపు వీరాచార్యులు, పర్వతనేని చినకామయ్య చౌదరి, మేడూరి వెంకటాచార్యులు, గ్రామస్తుల సహకారంతో పునఃప్రతిష్ఠ చేశారు. ధ్వజస్తంభం స్థాపించిన తొలినాళ్లలో మూడేళ్లకో పర్యాయం జెండా ఉత్సవం జరిగేది. ఉత్సవాన్ని జరిపించిన భక్తుల కోర్కెలు నెరవేరటంతో జెండా ఉత్సవాన్ని జరిపించడానికి భక్తులు ముందుకు రావటం అధికమైంది. దీంతో ప్రతి సంవత్సరం శ్రావణ మాసం రెండో శుక్రవారం జెండా ఉత్సవాన్ని జరిపించటం సంప్రదాయంగా సాగుతోంది.

ఈనెల 25న జెండా ఉత్సవం...

శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఈనెల 25న బ్రహ్మంగారి జెండా ఉత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బిల్డర్ బొబ్బా గోపాలకృష్ణ, కృష్ణప్రియ దంపతులు ఉత్సవాన్ని నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. దీంతో ధ్వజస్తంభం చుట్టూ కర్రలతో అడితి కట్టి, నూతన రంగులతో ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు.

నేటితో ముగియనున్న ఓటర్ల సర్వే

విజయవాడరూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల రోజులుగా జరుగుతున్న ఓటర్ల సమగ్ర సర్వే కార్యక్రమం సోమవారంతో ముగుస్తుందని గన్నవరం నియోజకవర్గం డెప్యూటీ తహసీల్దార్(ఎన్నికలు) గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలో విజయవాడ రూరల్ మండలంలో మొత్తం 40,230 గృహాలుండగా వాటిలో 15,190 గృహాలను(19వ తేదీ నాటికి) బూత్‌స్థాయి అధికారులు ఇంటింటా సర్వే నిర్వహించారన్నారు. కొత్త ఓటర్లుగా నమోదు చేయించుకోదల్చిన వారు తమ ఓటును బూత్ స్థాయి అధికారుల వద్ద లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. పేరులో తప్పులు ఉంటే ఫామ్ 8 అందజేయాలన్నారు.

అట్టడుగు వర్గాల జీవితాల్లో మార్పునకు కృషి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అట్టడుగు వర్గాల జీవితాల్లో మార్పు తేవడానికి లయన్స్ క్లబ్ కృషి చేస్తోందని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జీఎస్ శంకర్ గుప్తా అన్నారు. చుట్టుగుంటలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ ఆఫ్ గీతాంజలి క్లబ్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడిగా మండా రాము, కార్యదర్శిగా పేరూరి వెంకటేశ్వరరావురావు, కోశాధికారిగా వి.సర్వేశ్వరరావు ఎన్నికయ్యారు. తర్వాత కొత్తగా ఏర్పాటుచేసిన అంజలి క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.సుధాకరబాబు, కార్యదర్శి గుర్రం ఏడుకొండలు, కోశాధికారి డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్, దుర్గా తేజ అధ్యక్షురాలు లక్ష్మి కుమారి, కార్యదర్శి డి.పద్మావతి, కోశాధికారి డి.శ్రీ వల్లితో డిస్ట్రిక్ట్ పాస్ట్ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు రావు ప్రమాణ స్వీకారం చేయించారు. అంజలి, దుర్గా



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శంకర్ గుప్తా

తేజ, గీతాంజలి వ్యవస్థాపకులు కొల్లూరి లయన్స్ సేవలను వివరించారు. కార్యక్రమంలో ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరిరావు రావు, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.వి.పి.ఎస్.ఆంజనేయులు , చైర్‌పర్సన్ దుర్గా భవాని, పాస్ట్ అంజలి క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పి.శ్రీనివాసరావు, బి.ఆంజనేయ రాజు, కొండాయిగుంట రాము తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత తరగతులు ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం భగవద్గీత తరగతులు ప్రారంభమయ్యాయి. సరస్వతీ సామ్రాజ్యం ఆధ్వర్యాన నిర్వాహకురాలు సునీత విద్యార్థులకు భగవద్గీత తరగతులు ప్రారంభించారు. మొదటి అధ్యాయం ప్రారంభించి అందులోని శ్లోకాలను విద్యార్థులకు వివరించారు. వారితో శ్లోకాలు పలికించి, సాధన చేయించారు. వాటి తాత్పర్యాలను వివరించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ భగవద్గీత మానవాళికి శ్రీకృష్ణుడు ప్రసాదించిన గొప్ప మార్గదర్శక గ్రంథమని పేర్కొన్నారు.భగవద్గీత అనేది మతానికి సంబంధించినది కాదని, అది సర్వమానవ సమాజానికి



భగవద్గీత శ్లోకాలు నేర్పిస్తున్న సరస్వతి సామ్రాజ్యం నిర్వాహకులు సునీత

దిక్సూచి లాంటిదన్నారు. తరగతిలోనే కాకుండా ఇంటి వద్ద కూడా సాధన చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, వై.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పవన్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.ఐ పవన్‌కుమార్ అన్నారు. గాంధీనగర్‌లోని విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఆదివారం 'సైబర్ నేరాలు –తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ సైబర్ స్పేస్ పరిధి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి అధునాతన టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డిజిటల్ క్రమశిక్షణ లేకపోతే ఫోన్ హాకింగ్, డేటా చోరీ జరగడం ద్వారా వచ్చే అనర్థాలను సోదాహరణంగా వివరించారు. పాస్‌వర్డ్ రక్షణ విధానం, వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫొటోస్, వాయిస్ కాల్స్ షేరింగ్‌తో వచ్చే ఇబ్బందులను, ఇటీవల వెలుగు చూసిన ఘటనలపై అవగాహన కల్పించారు. సభ్యులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం పవన్ కుమార్‌ను చాంబర్ ప్రతినిధులు సత్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చాంబర్ సంయుక్త కార్యదర్శి ఈమని దామోదర్, ప్రథమ ఉపాధ్యక్షులు పొన్నూరు రామకుమార్, మాజీ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్, విజయవాడ చాంబర్ పక్ష పత్రిక ఎడిటర్ డాక్టర్ ఎంసీ దాస్ పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

ఎస్ఎన్‌పురం సీఐ వెంకటనారాయణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు అనుమానితుల కదలికలపై పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా ఎస్ఎన్‌పురం సీఐ వెంకటనారాయణ ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలోని ఆటోడ్రైవర్లకు ఆదివారం రాత్రి ఎస్ఎన్‌పురం పోలీసులు అవగాహన కల్పించారు. వెంకటనారాయణ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు, రవాణాశాఖ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా నగరంలో అనుమానితులను గుర్తిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ప్రయాణికులతో



రైల్వేస్టేషన్ వద్ద ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటనారాయణ

మర్యాదగా నడచుకుంటు లగేజీలను మర్చిపోతే బాధ్యతగా పోలీసులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎం.దుర్గామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మకు బోనాలు

నరసింహారావుపాలెం(వీరులపాడు): మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో ముత్యాలమ్మ బోనాల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మూడు రోజులుగా అమ్మవారికి జలబిందెలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని, డప్పు వాయిద్యాలతో బోనాలను గ్రామంలో ఊరేగించి ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో సంతోషంగా ఉండాలని ఏటా అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఉప సర్పంచ్ గుంటక మాధవరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, కోలా శ్రీను, శీలం సంజీవరెడ్డి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలయంలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు

దంతాల సంరక్షణతో మెరుగైన ఆరోగ్యం

కంకిపాడు: దంతాల సంరక్షణతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని దంత వైద్య నిపుణులు వణుకూరు ప్రవీణ్ అన్నారు. గోసాల జె.డి. డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో రొయ్యూరులో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 90 మంది రోగులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ పంటి సంరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు సీహెచ్ అనూష, డాక్టర్ సీహెచ్ హధస్సా పాల్గొని వైద్య సేవలు అందించారు.



ఇంద్రకీలాద్రిపై భక్తజన సందడి





శ్రావణ మాసం పురస్కరించుకుని ఆదివారం ఇంద్రకీలాద్రిపై భక్తజన సందడి కనిపించింది. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమ పూజలను విశేషంగా చేయించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో మెట్ల పూజలను చేశారు. ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో క్యూలైన్లు ఆధ్యాత్మిక తరంగాలయ్యాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





వేంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గానికి దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని పురాతన ఆలయాల్లో ఒకటైన బ్రాహ్మణ వీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలకవర్గం నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీన దేవదాయ ధర్మదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ కార్యాలయం ఈ పాలకవర్గ నియామకానికి నోటిఫికేషన్‌ను విడుదల చేశారని పేర్కొన్నారు. నోటిఫికేషన్ తేదీ నుంచి 20 రోజుల లోపు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరింత సమాచారానికి ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

తిరుపతమ్మ ఆలయానికి విరాళాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు ఆదివారం విజయవాడకు చెందిన శాంతి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కొల్లి క్రాంతికిషోర్ రూ.10 వేలు విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం మండలం, ఏనుగుమహల్‌కు చెందిన శ్రీశాంభవి పీఠాధిపతి మిరియాల శేషగిరిరావు దంపతులు చైర్మన్ ఇంజం చెన్న కేశవరావుకు రూ.10,001 విరాళంగా అందజేశారు.